## కథ

# మిస్టర్ ఆక్రోశం

**విహారి**

**కవుల్నీ, కథకుల్నీ కలిపి తిట్టుకున్నాడు మురళి. ఆ వెంటనే విమర్శకుల్నీ, ఫీచర్ రైటర్స్‌నీ సామూహికంగా దుమ్ము దులిపేశాడు. ఆ తర్వాత ఢిల్లీ మీద, హైదరాబాద్ మీద జంటగా ఒంటికాలి మీద లేచాడు. వ్యవస్థ మీద ఘోషపెట్టేవారు వ్యక్తుల మీద ఎగిరిపడరేం అని కసురుకున్నాడు. రాజకీయాల్నీ, అధికారాన్నీ జమిలిగా శాపనార్థాలు పెట్టాడు. మనుషుల్లో నీతీ నిజాయితీ మంటగలిశాయనుకున్నాడు. విలువలకి వలువ లూడిపోతున్నాయని వాపోయాడు.**

**రేగిన కసిని ఇల్లంతా కలయదిరిగి నలువైపులా విరజిమ్మాడు. ఇదంతా మురళి మనస్సులో జరిగిన ఒక (నీ)రసాయన క్రియ!**


అసంకల్పిత ప్రతీకార చర్యగా పళ్లు పెదవుల్ని కొరికినై. కసిత్వం తాటి ప్రమాణంగా లేచింది.

ఫోన్ మోగింది. తీశాడు. అవతలి వైపు నుంచీ వేణు. ''మెనీ మెనీ హ్యాపీ రిటర్న్సు ఆఫ్ ది డే నాన్నా'' చెప్పాడు. థాంక్స్ చెప్పాడు మురళి. ''అమ్మకివ్వు'' వేణు. అప్పటికప్పుడే భర్త పక్కకి వచ్చి నిలబడింది ఉషా సుందరి. ఫోన్ అందుకుంది.

హాల్లో కూర్చున్నాడు మురళి. జుట్టు సరిచేసుకుని తల విదిలించుకున్నాడు. ''ఆ, ఈరోజు మళ్లీ మళ్లీ రావాలి. ఛస్తాను. ఇంకేమక్ఖర్లేదు. ఉన్న ప్రాణం గాలిలో కలుస్తుంది'' పైకే అన్నాడు.

ఫోన్ సంభాషణ అయింది. ఉష భర్త మాటలు విన్నది. కళ్లు పెద్దవి చేసుకుని ఆయన్ని చూసి, ''అవేం మాటలండీ. ఏం జరిగిందనీ అంత చిరాకూ, విసుగూ, కోపం, కసీ. మామూలు విషయాలకి ఇంతగా బీ.పీ. పెంచుకుంటారేం'' అని పక్క కుర్చీలో కూచుంది.

''అవును. నీకన్నీ మామూలు విష



యాలే. పొద్దున్నే పాలవాడు అర్ధలీటర్‌కి అర్ధరూపాయి చొప్పున నొక్కేశాడు. అదేమంటే 'నా దగ్గర పాకెట్ తొమ్మిదిన్నర, అంతే సార్' అని పొగరుమోతు సమాధానం. నో ఆస్కర్ నో టెల్లర్''.

భర్తకేసి అదోలా చూసి, ''అందుకే మిమ్మల్నింకో నాలుగడుగులేసి రామ్‌నగర్ చౌరస్తాలో తెమ్మన్నాను'' అన్నది. నెపమెన్నుతోందని భార్యని గుర్రుగా చూశాడు మురళి.

''అవును. నువ్వెక్కడేడవమంటే అక్కడేడవాలి'' అన్నాడు.

వచ్చీరాని చిరునవ్వుతో కుర్చీలోంచీ లేచింది ఉష.

''ఏదో మహాత్మాగాంధీ జన్మదినంలా ఏభయ్యో ఏడు కదండీ. సరదాగా గుడికి పోయొద్దామని బయల్దేరావ్ – ఉదయాన్నే. పోవటానికి అరవై ఆరు రూపాయలు ఆటో. ఎక్కుతుంటేనే వాడి హెచ్చరిక – నా బండి ఇరవై పైసల సెట్టింగ్ సార్ అని. నిన్ను దోచుకుంటాను సిద్ధమేనా అన్నట్టు, కత్తి పుచ్చుకున్నట్టు మరీ చెప్పాడు. సరి. తిరుగు ప్రయాణం వేరే ఆటో. అదే రూట్‌లో డెబ్బై ఎనిమిది. దోపిడీ. దారుణం. కడుపు రగిలిపోతోంది. నీకేమో చీమకుట్టినట్టన్నా లేదు...''

మౌనంగా కదలబోయింది ఉష. మురళి లేచాడు. ఆవేశంగా తన మాటలు సాగించాడు. ''అదేమిరా మగడా అంటే ఆ రిక్షావాడేమన్నాడో తెలుసా – 'ప్రూవ్ చెయ్యండి. నా మీటర్ తప్పని మళ్లీ అంటే – నేను మంచోణ్ణి కాదు. నేను లా కూడా చేశాను' అన్నాడు. అతని ఖర్మ అట్టా ఏడ్చింది. నా ఖర్మిట్టా కాలింది.''

ఉష వంటింట్లోకి వెళ్లిపోయింది.

భర్త జన్మదినం. ఆదివారం. కూడబలుక్కుని – రెండూ ఈదురు గాలితో మొదలైనయ్ అనిపించింది.

కొద్దిసేపు పచార్లు చేసి మళ్లీ కూచున్నాడు మురళి. టీపాయ్ మీది దినపత్రికని చేతుల్లోకి తీసుకున్నాడు. చూశాను. 'దేశమంతటా దొంగ ఐదువందల నోట్లు!' మనసులో భేరికా డాండడ డాండడాండ నినదంబులు, నాదంబులు, మోతలు మొదలైనాయి.

''అవును. దొంగనోట్లు ఛలామణీ ఒక లెఖ్ఖా! దొంగ మందులు, దొంగ పాస్‌పోర్టులు, దొంగ స్టాంపులు, చివరికి దొంగ జీవోలు... అన్నీ చలామణి అవుతయ్. ఈ దేశానికి మోక్షం లేదు.''

చైతన్య స్రవంతి సాగిపోతోంది – మురళి అనే బుద్ధిజీవి మేథోమార్గంలో!

పేజీ తిప్పాడు. 'ధరల నియంత్రణకి ప్రత్యేక చర్యలు' ఎవరిదో హామీ!

''అవును. అందుకనే బీరకాయలు కిలో ఇరవై నాలుగు. సపోటా పండ్లు పదికి నాలుగు. అరటి పండ్లు డజను ఇరవై నాలుగు. క్రిందటి నెల బీ.పీ. టాబ్లెట్లు ముప్పై. ఈనెల ముప్పై ఆరూ డెబ్బై అయిదు పైసలు'' పైకి గొణుక్కున్నాడు.

ఇప్పుడు ఉష డైనింగ్ టేబుల్ దగ్గరికొచ్చింది. విన్నది..

''ఏం చేస్తాం. నలుగురితోపాటు మనమూ అనుభవించాల్సిందే గదండీ'' అంది. ఆమె గృహిణీత్వం ఎడ్జస్ట్‌మెంటాలిటీకి ఎప్పుడో అలవాటుపడిపోయింది.

''దుకే మిమ్మల్ని పేపర్ చదవొద్దనేది. అడ్డమైన వార్తలు చదవటం, బీపీ రెయిజ్ చేసుకోవడం. ఇందాక ఫోన్‌లో వేణుగాడు అడుగుతున్నది దీని గురించే.''

భార్య మాటల్లోని అవ్యక్తమైన నిందకీ, నిష్ఠూరానికీ అగ్గి రగిలింది మురళికి. ఒక్క క్షణం ఆమెవైపు తీక్షణంగా చూసి, ఉక్రోషంతో గుడ్లురిమి పేపర్‌లో పేజీ తిప్పాడు.



## అంతులేని ఆనందం

ఒకట్రెండేళ్లపాటు ఒకటే పనిమీద దృష్టి నిలిపితే లైఫ్ బోర్ కొడుతుంది. ఐతే సినిమా తారలకి మాత్రం ఇది మినహాయింపులాంటిదే. మాజీ అందాలసుందరి ప్రియాంకాచోప్రా ఎంతో ఆనందంగా ఉంది. ఎందుకంటే ఎప్పట్నించో ఊరిస్తున్న ఓ కంపెనీ అగ్రిమెంట్ ఈమధ్యే పూర్తయింది. ఇంతకీ ఆ సంగతేంటంటే మనదేశంలో సినీ నిర్మాణంలో తనకంటూ ఒక ప్రత్యేకతని సంతరించుకున్న యుటివి ప్రియాంకాతో కలిసి మూడు సినిమాలు నిర్మించనుంది. ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్ కూడా పూర్తయిందని తెలిసింది. ఈ డీల్‌తో ప్రియాంకా గోల్లు గిల్లుక్కూచోడానికి కూడా ఆమెకి ఖాళీ ఉండదట. అందుకేనేమో ఈ సొగసరి తెగ సంబరపడిపోతోంది!

డైనింగ్ టేబుల్ మీది ఆకు కూరని తీసుకుని వంటింట్లోకి వెళ్లిపోయింది ఉష.

ఉన్నట్టుండి ఖంగుతిన్నట్టు ఉలికిపాటుతో పేపర్ పేజీలన్నీ రెండుమూడుసార్లు పరీక్ష చేసి, 'ఛీ... ఛీ' అన్నాడు మురళి. ఆనాటి అనుబంధం పుస్తకం రాలేదు. ''ఇదీ వరస. మనకేది ముఖ్యమో అదే మిస్సింగ్. బతుకే అట్టా తయారైంది. ప్రతి వారం చెప్తాను ఆ కుర్రకుంకకి. పుస్తకం చెక్‌చేసి మరీ పడెయ్‌రా పేపర్ని అని. వింటేగా. తూనీగలా ఒకటే పరుగు. నిలవడు. ఏ చాయ్ బండి దగ్గరో రెండుకో మూడుకో అమ్ముకుంటాడు విడిగా. మర్నాడు అడిగామా... 'పొరపాటయింది సార్. మిస్సయింది' అంటాడు. ఆ అనటంలో 'ఆకాశమేమీ ఊడిపడలేదులెండి' అనే అర్థాన్ని ముక్కుమీద గుద్దుతాడు. కేజువల్ ఫెలోస్!''

పేపర్ బాయ్ మీద అప్రకటిత యుద్ధం మొదలెట్టాడు మనసులో. 'ఆ పుస్తకంలో ఫెయిల్యూర్ స్టోరీస్ వస్తున్నయ్. ఇదే పెద్ద ఫెయిల్యూర్ స్టోరీ' అనుకున్నాడు.

హఠాత్తుగా పిడుగుపడ్డట్టు 'కాఫీనే' అని అరిచాడు. అదిరిపోకపోయినా, అలవాటుగా 'తెస్తున్నా' అన్నది ఉష. 'సాహిత్యకారుడే కానీ, ఈయన గుణభంగమైన శార్దూలం' అనుకున్నది మనసులో! ఒక్కసారిగా ఆమెకు ఏదో కమ్మతెమ్మెర తాకినట్లయింది. సన్నటి నవ్వు కదిలింది పెదవుల మీద. 'నేనూ కవిత్వమో, కథలో ప్రయత్నం చేయొచ్చు' అనుకుంది. మరి కాస్త పెద్ద నవ్వు పైకి వచ్చేసింది. తనలో తానే ముచ్చటపడింది. అసంకల్పంగా బారెడు జడనీ బుజంమీదికి లాగి ముందుకు వేసుకుంది. కాఫీ కప్పు తీసుకుని కదిలింది. భర్తకు ఇచ్చి తిరిగి వంటింట్లోకి వెళ్లింది.

కాఫీ తాగుతూ టీ.వీ. ఆన్ చేశాడు మురళి. బొమ్మ రాదు. కేబుల్ దగ్గరే కరెంట్ పోయివుంటుందనుకున్నాడు.

కాఫీ అయింది.

టీ.వీ. రాలేదు. ''ఛీ... ఛీ... వొకటే తరుగు. బతుకంతా ఎప్పుడేం కావాలనుకుంటానో అది దొరకదు'' అనుకున్నాడు. హృదయమంతా నిరాశ నిండింది.

గతం కళ్లముందు మెదిలింది.

ఇంజనీరింగ్ చేద్దామనుకుంటే సీట్ రాలేదు. 'నేను డొనేషన్‌లు కట్టలేను' అన్నాడు తండ్రి. బిఎస్సీ చేశాడు. ఏదో మెషిన్ టూల్స్ కంపెనీలో సాదాసీదాగా ఉద్యోగం లభించింది. 'పిల్ల బాగుంది. మాకు నచ్చింది' అని అమ్మ అంటే, ఉషాసుందరి తనకు భార్య అయింది. తన అంతరాంతరాల్లో చదువుకున్న ఉద్యోగిణి భార్యగా కావాలనే కోరిక వుండేది. సామాజిక కారణాలనుకోండి, వ్యక్తిగతమైన వెర్రి అనుకోండి, తొలిబిడ్డ కొడుకైతే బాగుణ్ణు అనుకుంటే, సుమిత్ర వచ్చింది. ఆమె ఇప్పుడు ఇంజనీరింగ్ పూర్తిచేస్తోంది. విజయవాడలో హాస్టల్‌లో వుంటోంది. రెండు – కొడుకు. వేణు. బిఎస్సీ కంప్యూటర్స్‌లో వున్నాడు. ప్రస్తుతం చెన్నై వెళ్లాడు – ఏదో విహారయాత్రకి. అందుకనే

పొద్దున ఫోన్‌లో శుభాకాంక్షలు! వాడికంటే ముందే సుమిత్ర ఉదయాన్నే చెప్పింది.

మళ్లీ చూశాడు టీ.వీని. రాలేదు. కేబుల్ వాళ్లకి ఫోన్ చేశాడు. మీ టీ.వీకే ఏదో అయిందని తేల్చారు వాళ్లు. ఉషకి తెలిసింది. ఆమె సలహా చెప్పింది, మెకానిక్‌కి ఫోన్ చేయమని. చేశాడు. అరగంటకి దిగాడు అతను. అవీ యివీ కెలికి, ఏదో పార్ట్ పోయింది – వెయ్యాలన్నాడు. ఆ నిర్ణయం వెంటనే చెప్పలేకపోయాడు మురళి. కారణం ఆ పార్ట్ ధర ఆరేడు వందలనడం. ఇంటికొచ్చి చూసినందుకు ఓ వంద యిమ్మన్నాడు మెకానిక్.

మురళి మనసు గీపెట్టింది. మెకానిక్‌కి వంద యిచ్చి పంపించి టెక్నాలజీనీ డెవలప్‌మెంట్‌నీ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మనుషుల్నీ అన్నింటినీ అందర్నీ కలిపి తిట్టి తిట్టి కుప్పపోసేశాడు.

మధ్యలో ఉష ముసిముసి నవ్వులకి రెచ్చిపోయి మరీ కోప్పడ్డాడు. భరించలేనంత బాధా, వ్యథా, ఏదో తెలియని ఆవేదనా – అతన్ని పూర్తిగా పిచ్చివాణ్ణి చేసేసినాయి.

''నా మాట విని ఆ పాత మేళాన్ని మార్చేయండి బాబూ'' ఉష అన్నది యథాలాపంగా.

మురళికి ముల్లు గుచ్చుకుంది. నాలిక మీదకి బూతుమాట రాబోయి ఆగిపోయింది. 'నీ బాబు...!' క్షణాల తర్వాత తమాయించుకుని బాధపడ్డాడు. పాపం ఉషకి బాబు లేడు. ఆయనేనాడో గతించాడు. 'ఆయన్ని రంగంలోకి తేవడమా... ఛ. తప్పు తప్పు' అని గాలిలోనే నెత్తిమీద మొట్టికాయ వేసుకున్నాడు.

తనకు జన్మదిన కానుక ఇదన్నమాట అనిపించింది. పెళ్లి పుస్తకం పోయింది, పాడాలని వుంది పోయింది, తెలుగు వెలుగు పోయినై! దుఃఖమేసింది. ఫ్యాన్ ఫుల్‌లో పెట్టుకుని సోఫా మీదే కళ్లు మూసుకు పడుకున్నాడు.

కలత నిద్రలో మసలుతున్న మురళికి భార్య కేక పెద్ద సైరన్‌లా పనిచేసింది. లేచి కూచున్నాడు. అదే ఊపున నిలబడి వంటింట్లోకి వెళ్లాడు.

''సింక్‌లోనూ, బాత్‌రూమ్‌లోనూ నీళ్లు పోవడం లేదు. కాస్త చూడండి'' ఉష కంఠస్వరంలో ఒకింత హడావిడి!

కాలమే తనమీద కత్తి కట్టినట్లనిపించింది మురళికి. భార్యకేసి బుసకొడుతున్న చూపు విసిరి దొడ్డి గుమ్మం దాటాడు. అక్కణ్ణుంచీ పైపు గొట్టాల వరసని చెక్ చేసుకుంటూ – ఉడతలా కాంపౌండ్‌వాల్ దగ్గరగా చేరాడు. అక్కడో పెద్ద మేన్‌హోల్ వుంది. వంగి మూత తొలగించి చూశాడు. మురుగు వాసన! భోపాల్ గ్యాస్ ట్రాజెడీ గుర్తుకొచ్చింది. ఠక్కున ముక్కు మూసుకుని లేచి నిలబడ్డాడు. మురుగంతా అక్కడ తెట్టుకట్టి మేట వేసినట్లు నిలిచి వుంది. అక్కణ్ణుంచీ ఆ స్యువరేజ్ పైపు ప్రహరీగోడ అడుగునుంచీ రోడ్ మీది అండర్ గ్రౌండ్ కాలువకి కలుపబడి వుంటుంది. 'చచ్చాన్రా దేవుడా?' అనిపించింది. దాన్ని చూడాలి. గేటు దాటి రోడ్ మీదకి వెళ్లి బక్కప్రాణంలోని ఉసురు, శక్తినంతా కూడదీసుకుని మేన్‌హోల్ ఎత్తి చూశాడు. మురళి కళ్లు మిలమిలలాడాయి! ఆ కాలవ తానే గంగాభవానినన్నంత గర్వంగా, నాట్య భంగిమల్తో, జాలుగా, వాలుగా – మురళి సంతృప్తికి వీలుగా ప్రవహిస్తోంది! 'హమ్మయ్య' అనుకుని మూత పెట్టేసి ఇంట్లోకొచ్చేశాడు.

ఉషాసుందరికి రిపోర్ట్ చేశాడు. తన యత్నానికీ, చిత్తశుద్ధికీ ఏవిధమైన మెచ్చుకోలూ దొరకలేదు. పైగా ఆమె అతిసౌమ్యంగా – ''కాస్త ఆ మునిసిపాలిటీ వర్కరెవరన్నా దొరుకుతాడేమో చూసిరండి'' అంది. మళ్లీ అంతలోనే ''దాని సంగతి వెంటనే చూడకపోతే, గంటలో ఇల్లూ వాకిలీ కంపుకొట్టిపోతాయి'' హెచ్చరికని జారీ చేసింది.

తన దురదృష్టాన్ని తాను నిందించుకుంటూ బయటికి నడిచాడు మురళి. వీధి చివర ట్రాన్స్‌ఫార్మర్‌కి ఆవలగా బేల్దారీ కూలీల అడ్డాకి పక్కన, టీ బండి దగ్గర దొరికాడు – సదరు మున్సిపల్ వర్కర్. ప్రాధేయపూర్వకంగా తన బాధ వివరించుకున్నాడు మురళి. 'సండే కదా సార్' అని నసిగేడు. మురళి మొహంలో దైన్యం, నీరసం, నిస్సహాయత – అన్నీ పనిచేసినాయి కాబోలు, 'సరే మీరు పదండి. నేను బద్ద తీసుకువస్తా' అన్నాడు. కాలువ సరిచేయడానికి అతను వాడే మేదరవాసం బద్ద అతనుదహరించిన సాధనం.

ఉషా సుందరి అడక్కుండానే మళ్లీ కాఫీ ఇచ్చింది. దాని భావం – 'లంచ్ చాలా లేటవుతుంది' అని!

వీళ్లిద్దరూ – ఆ ఇంటి పూర్వగాథ గురించి ముచ్చటించుకోసాగారు. ఉషాసుందరి తల్లి యిల్లు ఇది. ఆమెకి – ఈమె, ఈమె అక్క వసంత మాత్రమే వారసులు. వసంతకీ ఈమెకీ జాయింట్‌గా ఇల్లు రాసేసి విల్లునిచ్చి చనిపోయింది తల్లి. వసంత ఢిల్లీలో ఉంటుంది. వాళ్లాయనకి సెంట్రల్ సెక్రటేరియట్‌లో పెద్ద ఉద్యోగం. ఇద్దరు పిల్లలు. ఉద్యోగాలు చేస్తున్నారు. వాళ్ల భాగానికి చట్టపరంగా దక్కే వారసత్వ హక్కు కింద – ఇంటి అద్దెని తామే ఇస్తూ ఈ ఇంట్లో ఉంటున్నారు మురళీ, ఉషాసుందరీ, కుటుంబమూ. చిన్న చిన్న రిపేర్లన్నీ వీళ్ల బాధ్యతే!

అంతలోనే వచ్చేశాడు మునిసిపల్ వర్కర్. విల్లంబు ధరించి దసరా కానుకకి వచ్చిన పాత కాలపు వీధి బడి విద్యార్థిలా ఉన్నాడు. ఆకారమూ స్వరూపమూ అలా వున్నాయి. మురళి అతనికి కాలవని చూపాడు. అలవాటుగా చొక్కా దేహానికి తొడుక్కున్నంత ఆత్మవిశ్వాసంతో – పెరట్లోని మేన్‌హోల్ మూత తీసి వంగి చూశాడు. నాలుగైదడుగుల దూరంలోని మురళి గబుక్కున ముక్కు మూసుకున్నాడు. అతనేమో బద్దని నిటారుగా, వంకరగా ఆ మేన్‌హోల్‌లోకి పెట్టి, అటూఇటూ పక్కలకీ, లోపలికీ తిప్పి, అలవోకగా కదులుతూ నిలబడ్డాడు. క్షణంలో సగం సమయంలో – నీరంతా బయటికి పోయింది. పైపంతా తేటగా బయటపడింది. మురళి ఊపిరి పీల్చుకున్నాడు. బద్దని పైకి లాగేసి, దాన్ని భుజంమీద పెట్టుకుని ఇవతలికొచ్చేశాడు వర్కరు. పెరటి గోడవారగా ఆ బద్దని పెట్టి ''రేపు తీసుకెళతాన్లెండి. ఉండనీయండి'' అని మేన్‌హోల్ మూతని పెట్టేసి అడుగు కదిల్చాడు. గేటువారగా నిలబడ్డాడు.

మురళి గొప్ప రిలీఫ్‌తో చకచకా లోపలికి వెళ్లి పైసలు తెచ్చాడు జేబులోనుంచి ఓ ఇరవై రూపాయల నోటు తీసి అతనికివ్వబోయాడు.

అతను ఆశ్చర్యంగా నోటునీ, మురళి మొహాన్నీ చూశాడు. 'ఏమిటిదీ?' అని గద్దిస్తున్న స్వరంతో అని 'నూటయాభై ఇవ్వండి' అన్నాడు.

మురళికి గుండె గుభేలుమంది. అది హఠాత్తుగా సమ్మెకి దిగి ఆగిపోలేదని నిర్ధారణ చేసుకుని 'నూటయాభయ్యా' అన్నాడు.



## ప్రతిభే పరమార్థం

తారలు చాలామంది తాము ప్రవేశించిన భాషలో సరైన అవకాశాలు రాకపోతే వెంటనే మరో భాషలోకి ప్రవేశిస్తున్నారు. ఇప్పుడు అందాలభామ ప్రీతీజింగ్యానీ సింధీ ఫిల్మ్‌లో నటించే అవకాశాన్ని చేజిక్కించుకుంది. కమల్.డి.నాథానీ దర్శకత్వంలో కొత్త చిత్రం 'ప్యార్ కరె దిస్'లో నటిస్తోంది. ఇంతకుముందు ఇదే దర్శకుని చిత్రం 'విత్ లవ్ తుమ్హారా'లో కూడా నటించింది. ఇందుకు తగ్గట్టుగా తన లైఫ్ స్టయిల్‌ని మార్చేసుకుంది. స్లిమ్‌గా తయారవ్వడానికి రెగ్యులర్‌గా జిమ్‌కి వెళుతోంది. ఇదిలా ఉంటే అనంత్ మహాదేవన్ కొత్త చిత్రం 'విక్టోరియా నెం-203'లో ప్రీతీ నటిస్తుండడంతో బాగా బిజీగా ఉంది. తారల ప్రతిభకు భాష అడ్డుగోడ కాకూడదని, ఏ భాషా చిత్రంలోనైనా నటించేందుకు తారలంతా సిద్ధంగా ఉండాలంటోంది ప్రీతీజింగ్యానీ.




''అవును. ఆదివారమని కాదు. ఈ పనికి అంతే''. అతను చల్లగా, అతి సాధారణంగా, తన హక్కుకి రాజీ లేదన్న ధోరణిలో లేని బల్లగుద్ది మరీ చెప్తున్నట్టు చెప్పాడు.

'చచ్చింది గొర్రె' అనుకుంది మురళి మనస్సు. 'మర్‌గయా సాలా' అనుకుంది అప్పుడప్పుడూ హిందీ వొలికించే నాలిక. గొంతు మాత్రం మాటకి మొరాయించింది.

కాళ్లకి కరెంటు పెట్టుకుని లోపలికి పోయి, వంద నోటు తెచ్చి అందించాడు. ''ఉంచు. కాస్త సర్దుకుపోవాలి. పెద్ద పని కాదుగా. పైగా మేమంతా నెల జీతాలమీద బతికేవాళ్లం తెలుసుగా. షావుకార్ల దగ్గర నీ రేటు నువ్ తీసుకో...'' వంటి కొన్ని వాక్యాలు – నెమ్మదిగా, నీరసంగా, వేడికోలుగా, ఒకింత హెచ్చరికతో, అలవాటు లేని హుందాతనంతో, మేకపోతు గాంభీర్యంతో – రాల్చాడు.

ఏ కళనున్నాడో అతను వెళ్లిపోయాడు.

మురళి ఇంట్లోకొచ్చేశాడు. సరాసరి భార్య ముందుకు వెళ్లాడు. జరిగింది చెప్పాడు. ఉల్లిత్తల్లే ఎగిరిపడ్డాడు. ఆ నీళ్లని ట్టిట్టా కెలికి రెండు నిముషాల్లో వంద రూపాయలు నిలబెట్టి వసూలు చేసిన వర్కర్‌ని లోపలి కసితీరా పైకి దూషించాడు. తన గ్రహచారం బాగాలేదని తనని తాను నిందించుకోలేక, భార్య అనే అమాయక పదార్థాన్ని నిందించాడు. అసలు ఆమే తనమీద కత్తికట్టిందని ఏదేదో అనేశాడు. పుట్టినరోజుకి సంతోషంగా భర్త కోసం చేస్తున్న పాయసంలో జీడిపప్పుని మాడ్చేసింది – ఉషాసుందరి! అవును మరి – ఆమె ఆలోచనలూ, ప్రతిస్పందనలూ ఆమెకీ వుంటాయి గదా!

పుట్టినరోజు భోజనంలో భార్య కష్టమే మిగిలింది, భర్త ఆనందం దక్కలేదు. నసుగుతూ, సణుగుతూ – వ్యవస్థ దౌర్భాగ్యాన్ని గురించీ, వ్యక్తి స్వార్థాన్ని గురించీ; ప్రత్యేకించి కవులూ, కథకుల 'సూడో సింపతీ' గురించీ – ఘాంద్రింపులతో, ఛీత్కారాలతో లంచ్ అయిందనిపించాడు మురళి. మౌనంగా తన ఆమోదాన్ని తెలుపుతున్న మొహంతో తన పని తాను చేసుకుపోయింది ఉషాసుందరి!

టీ సమయం. సుమిత్ర పెళ్లి ప్రసక్తి తెచ్చింది ఉష. మేరేజ్ బ్యూరో వారిని విచారించాలి. అక్కడ పేరు నమోదు చేస్తే, చదువు పూర్తికాగానే – వచ్చిన సంబంధాల్లో మంచిది చూసి చేసేస్తే ఆ బాధ్యత తీరుతుందని భార్యగా తన ఆలోచన తాను చెప్పింది ఉష.

ఫోన్ చేశాడు – వివరాలకోసం. ఆ ఆఫీస్ ఆదివారమే బిజీగా పనిచేస్తుంది! అవతలివైపు నుంచీ చెప్పుకొచ్చింది – ఎవరో కల్యాణి! రిజిస్ట్రేషన్ ఐదు వందలు. ఫోటోలు... నెట్‌లో పెట్టేందుకూ, ఎన్నారై అడ్రస్‌లకీ వగైరా వగైరా ... ఏవో అంకెలూ గుణింతాలూ.. వింటూ విననట్టూ విన్నట్టూ, తెలిసినట్టూ, తెలియనట్టూ – ఏదో జరిగిపోయింది మురళి బుర్రలో. చివరికి ఆ పిల్ల చల్లగా వో బాంబు పేల్చింది. 'పెళ్లి కుదిరితే మాకు చెప్పాలి. ముహూర్తం సమయంలో మా కానుక, అదే బహుమానం, మాకు ముట్టచెప్పాలి' అంది. 'అదేమిటీ. ఎంత?' అంటే 'కనీసం పదివేలు. కట్నం వగైరా వుంటే ఆ రేటు వేరు' – ఇదీ సారాంశం!

ఉడికిపోయాడు మురళి. కోపంగా అడిగాడు. ''ఇవ్వకపోతే ఏం చేస్తారు?''

''మా పద్ధతులు మాకుంటాయ్‌లెండి'' అనేసి ఫోన్ పెట్టేసింది కళ్యాణి! మురళి అవాక్కయ్యాడు!

అతని ఘోషకి కొత్త సబ్జెక్ట్ దొరికింది. ఉష ముందు ఏవేవో మాట్లాడాడు. 'ఈజీ మనీ', 'బహుకృత వేషం' అని ఏవైనా శీర్షికలు పెట్టుకోవచ్చు ఆ ప్రసంగాలకి.

ముగింపుగా – 'ఈ చావు నే చావలేను. వద్దులే' అన్నాడు. భార్య మొహం ముడుచుకుంటుందనుకున్నాడు. అక్కడా నిరాశే ఎదురైంది మురళికి. 'సరే కానీయండి' అంది చప్పగా.

చిన్నచిన్న సుఖసంతోషాలు సైతం వ్రేళ్ల సందుల్లో నుంచీ ఇట్టా జారిపోతాయేమో అనే మథనలోకి దిగాడు మురళి. మధ్యతరగతి గతి ఇంతేనా అని ఒక చింతా, చింతనా బాధించసాగాయి.

సాయంత్రం –

ఆరు గంటలు దాటింది. అంతరంగంలో ఆలోచనల ఆటుపోట్ల హెచ్చుతగ్గులు తప్ప అసలు ఘోష అలాగ సాగుతోంది మురళికి.

ఏదో మేగజైన్ తీశాడు. ఆరోగ్య పత్రిక. చూపులు ఏదో ఆర్టికల్ మీద ఆగిన్నై. చదవసాగాడు.

హృద్రోగ నిపుణుడు సలహాలూ.. సూచనలూ అందించాడు. 'మీరు వయస్సు ఏభైలో ప్రవేశించారా – జాగ్రత్త!' హెడ్డింగ్ ఆకర్షించింది. చదివాడు.

''నో ఈటింగ్; నో ఎమోషన్; నో ఎగ్జయిట్‌మెంట్! త్రీ – ఈ ఫార్ములా. దెన్ నో బీపీ, నో హార్ట్ ప్రాబ్లెమ్!'' – ఇదీ సందేశం.

ఉలిక్కిపడ్డాడు మురళి. శతకోటి ఆలోచనలు మేథలో సుళ్లు తిరిగాయి.

తాను ఏభైలో పడ్డాడు! అవును. పాలూ, పండ్లూ, కూరల ధరల గురించి వర్రీ కాకూడదు. ఆటోమీటర్ల ఆగడాలకి ఆందోళన చెందకూడదు. మెకానిక్‌లూ, వర్కర్ల చార్జీల మోతకి రెచ్చిపోకూడదు. ఇంకా – లాండ్రీవాళ్ల ఆలస్యానికి అరవకూడదు. పిల్లల ప్రవర్తనకీ, పద్ధతులకీ దిగులుపడకూడదు. కుడి ఎడమల దగాలకి అనవసరంగా 'యాజిటేట్' కాకూడదు. నెలనెలా అప్పులకీ, క్రెడిట్ మనీ వొత్తిళ్లకీ లోపిరికి వుండకూడదు. అన్నిటికీ మించి ఆఫీస్‌లో బాస్ 'డూ యాజ్ ఐ – సే'' అంటే పెదవులు కొరుక్కోకూడదు; పళ్లు బిగించుకోకూడదు. ఫర్లేదు. క్రియలు అటువిటు అయినా మునిగిపోయిందేమీ లేదు! నో ఎమోషన్! త్రీ ఈ ఫార్ములా!!

ఎందుకనీ?

తన ప్రశ్నని తానే కసురుకున్నాడు. ''అవును. గొంగట్లో భోంచేస్తున్నాం. కుంటి ప్రశ్నలేయకు!''

''ఆఫ్టాల్. నువ్ మిడిల్ క్లాస్ ఫెలోవి. శ్లేష్మంలో ఈగవి!''

అంతా అర్థమై ఏమీ తెలియనట్లయింది మురళికి.

ఏడుపు పొంగుకొచ్చింది.

పైకి ఏడవలేకపోయాడు! పుట్టినరోజు గుర్తుకొచ్చింది!!!

★